# మంచీ - చెడూ

ఈసారి అమెరికాలో నేను చూస్తున్న, నాకు తెలిసిన మంచీచెడుల గురించి వ్రాద్దామనుకుంటున్నాను. మంచీ చెడూ అనే పదాలు వాడాను కానీ ఇంతకు ముందు మనం అనుకున్నట్టుగా కొన్ని సందర్భాల్లో మంచీచెడూ అన్నవి మనం ఎటునించీ చూస్తున్నామన్నదాన్నిబట్టి వుంటుంది. అమెరికన్స్‌కి అమెరికాలో ఏది మంచో చెడో అమెరికన్ దృష్టిలోనే చూద్దాం. మంచిని వెంటనే గ్రహించు గర్జించు, విమర్శని మాత్రం కొంచి ఆగి ఆలోచించి చేయి అని ఒక సామెత వుంది. అందుకని అక్కడక్కడా మనకి నచ్చకపోతే, మన దృష్టి కూడా సారించి, ఉచితమైనా అనుచిత మైనా మనకి తోచింది ఉచితంగా మన తెలుగులో చెప్పేసుకుందాం.

అమెరికా ఈ రోజు సంపన్నమైన దేశం. సహజమైన వనరులనన్నింటినీ ఒక పద్ధతి ప్రకారం పూర్తిగా వాడుకుంటున్న దేశం. రాజకీయంగా ప్రపంచంలో అగ్రదేశం. ఎన్నో దేశాలు ఆర్థికంగా అమెరికా మీద ఆధారపడివున్నాయి. సాంకేతికంగా ఎంతో ముందు వుంది. అలాగే క్రీడారంగంలో ఎన్నో సంవత్సరాలుగా ముందు బెంచీలో వుంది. ఇదంతా ఏదో యాదృచ్ఛితంగానో, అదృష్టవశాత్తుగానో ఒక్కరోజున జరిగింది కాదు. దాని వెనుక ఎంతో పట్టుదల, కార్యదీక్ష, పనితనం, కృషి అన్నిరకాల కష్టాలూ వున్నాయి. అవేమిటో చూద్దాం ఈసారి మన కబుర్లలో.

ప్రపంచంలో ఎన్నో దేశాలనించి ఎంతోమంది అమెరికాకి వలస వస్తున్నారు. అందులో ఎక్కువగా ఆసియా వాసులు. వాళ్ళల్లో మనవాళ్ళుకూడా పెద్ద సంఖ్యలో వుంటున్నారు. పోయిన సంవత్సరం ఇండియా వెళ్ళినప్పుడు గుంటూరులోనే ప్రతి పేటనించీ సందునించీ కనీసం ఒకళ్ళనైనా అమెరికాలో వున్నారని అన్నారు. అమెరికా అందించే సుఖాలూ, కష్టాలూ ఇటు చదువుల్లోకానీ అటు ఉద్యోగాల్లోకానీ అందుకో వటానికి మాతృభూమిని వదలి పెద్ద సంఖ్యలో వస్తున్నారంటే ఏదో ఆకర్షణ వుండే వుండాలి. ఇంతకు ముందు ఎన్నో కబుర్లలో మనం ఈ విషయాలు చెప్పుకున్నాం కనుక, ఈసారి ఇంతకుముందు చెప్పుకోని కొన్ని కొత్త విషయాలు చూద్దాం. మన పరిశీలన ఒక పద్ధతిలో జరపాలంటే ముందు మనుష్యుల వ్యక్తిత్వాల దగ్గర మొదలు పెట్టి, సంఘపరంగా చూసి, ప్రభుత్వం గురించి మాట్లాడుకుందాం.

శ్రీశ్రీగారు ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం అన్నారు. ఒక విధంగా ఆ పరపీడన పరాయణత్వం మన దేశంలోనూ ఇతర దేశాల్లోనూ రకరకాల రాజుల మధ్యా, ఒక దేశానికీ ఇంకో దేశానికీ మధ్యా జరిగినవే. కాకపోతే అదొక్కటే చరిత్ర కాదు. ఎన్ని అవాంతరాలొచ్చినా కొన్ని దేశాలు ఎలా పురోగమించాయో అలాగే కొన్ని దేశాలు ఎలా వెనకపడిపోతున్నాయో, కొన్ని దేశాలు ఎలా కాలగర్భంలో కలిసి పోయాయో కూడా అదే చరిత్ర చెబుతుంది. ఉదాహరణకి 1945లో అణుబాంబుకి నేలమట్టమయిన జపాన్ ఇరవై ఐదేళ్ళలో ప్రపంచంలో ఎన్నో రంగాలలో అగ్రస్థానం లోకి చేరుకుంది. కమ్యూనిజం ఇనప తెరను తొలగించుకుని ధనస్వామ్య దేశంగా

మారిన చైనా, పదిహేళ్ళల్లో ఆర్థికంగా అగ్రస్థానంకి వెళ్ళి, కాపిటలిష్టు దేశాలకి ఆర్థిక సూత్రాలు నేర్పుతున్నది. వీటన్నిటి వెనకాల దాదాపు ఒకటే కనపడుతుంది నాకు. ముందుకు పోవాలనే తపన. అందరి కన్నా ముందుకు దూసుకుపోవాలనే దీక్ష. దాని కోసం కృషి, త్యాగాలు. అనుకున్నది సాధించేదాకా వదలని పట్టుదల. సాధారణ అమెరికన్ పౌరుడిలో ఈ లక్షణాలు మోతాదుకి మించే వున్నాయి.

చిన్న పిల్లలుగా వున్నప్పుడే వీళ్ళకి ఇంట్లో, స్కూల్లో చెప్పేది ఒక్క మనిషి చాలు దేన్నయినా సరే మార్చటానికి అని. నీవల్ల ఏమవుతుంది అని కాక, 'యు కెన్ మేక్ ఎ డిఫెరెన్స్' అని వాళ్ళ బుర్రల్లోకి ఎక్కిస్తారు. అంతేకాదు ఒక మనిషిగా వాళ్ళ వ్యక్తిత్వం పెరగటానికి ఎంతో కృషి చేస్తారు. 'నేను' అన్నది ఎక్కువగా కనిపిస్తుంది. దానివల్ల లాభాలున్నాయా? చాలమంది 'నేను' ని వాళ్ళ ప్రగతి కోసం, దేశ ప్రగతి కోసం వాడటం చూస్తూనే వుంటాం. వాళ్ళ కిష్టమైన చదువులే చదవటం, 16-17 సంవత్సరాల వయసురాగానే, చదువుకుంటూనే ఉద్యోగంచేసుకుంటూ వాళ్ళ ఖర్చులు వాళ్ళే భరించటం స్వతంత్రంగా బ్రతకటంలాటివి సాధారణంగా కనపడేవే. ఇలా పెంచినందువల్ల నష్టాలున్నాయా?ఉన్నాయంటారు కొందరు తల్లిదండ్రులు. లేవంటారు పిల్లలు. అది మళ్ళీ మనం ఎటునించీ చూస్తున్నామన్న దాన్ని బట్టే వుంటుంది.

పిల్లా పెద్దా చాలవరకూ స్నేహంగా వుంటారు. మనకి తెలిసినా తెలియక పోయినా నవ్వుతూ పలకరిస్తారు. షాపుల్లో, ఆఫీసుల్లో ఎక్కడయినా అంతే. ఎవరైనా ఏదైనా బహుమతి ఇస్తే, పాకెట్ వెంటనే తెరిచి బాగుంది అని మెచ్చుకుంటారు. వాళ్ళకి నిజంగా నచ్చకపోయినా ఇతరులని నొప్పించరు. అలాగే మనం ఏదన్నా మంచి డ్రస్ వేసుకున్నా, కొత్తగా కారు కొన్నా చాల బాగుంది అని వెంటనే అంటారు. అనుకున్నది సాధించేదాకా వదలని పట్టుదల చాలమందిలో స్పష్టంగా కనిపిస్తుంది. నలుగురు పిల్లల్ని కన్న తర్వాత యూనివర్సిటీలో చేరుతుంది ఒకావిడ పై చదువుల కోసం. కొన్నాళ్ళు ఇంజనీరు పనిచేసి, దానిమీద ఉత్సాహం పోయి, లా డిగ్రీలో చేర తాడు ఇంకొకతను. మావూళ్ళోని లాన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్ అనే అతను కాన్సర్‌కి మందులు తీసుకుంటూ మారథాన్ సైకిల్ రేసులో (టూర్ డి ఫ్రాన్స్ - క్రాస్ కంట్రీ రేస్) ప్రతి సంవత్సరం పాల్గొంటూ, గెలుస్తూనే వున్నాడు. అలాగే సూపర్ మాన్ క్రిష్టఫర్ రీవ్స్ గుర్రం మీదనించీ పడి నడుము విరిగి పక్షవాతం వచ్చినా ఎన్నో సంవత్సరాలటు చావుతో పోట్లాడుతూ అలాటి రీసెర్చికోసం కొన్ని మిలియన్ల డాలర్లు చందాలుగా సేకరించాడు. ఆ పట్టుదల ఎంత గట్టిదో చూపిద్దామని చెబుతున్నానివి.

ఎంతటి వారైనా ఎవరైనా చట్టాన్ని పాటించి ఇతరుల హక్కుల్ని గౌరవిస్తారు. ప్రతి రోడ్డుమీద ప్రతిరోజూ కొన్ని వేల కార్లు వరుసలో అలా పద్ధతి ప్రకారం పోతూ వుంటాయి. తలతిక్కగా నడిపేవాళ్ళు అక్కడా ఇక్కడా వున్నా తక్కువే అని చెప్పాలి. అలాగే రోడ్లూ షాపులూ శుభ్రంగా వుంచటం, ఎక్కడయినా చెత్త కనిపిస్తే తీసి గార్బేజ్‌లో పడేయటం మామూలే.

సంఘపరంగా చూస్తే, ఇక్కడ నాకు బాగా నచ్చినవి చదువులు. డిగ్రీల కోసం కాక తరువాత ఉద్యోగంలో ఉపయోగపడే చదువులు. జాబ్ ఓరియన్‌టెడ్

ఎడ్యుకేషన్ అంటారు. సిలబస్సూ అంతే. అనవసరమైనవి చదవక్కర్లేదు. ఉద్యోగాలలో కూడా చదువులకన్నా పనితనానికే ప్రాధాన్యం కనుక, సామర్ధ్యం వున్నవాళ్ళకే ఉద్యోగాలుంటాయి. అలా సామర్ధంమీదే ఉద్యోగావకాశాలు వున్నాయి కనుకనే ఎంతో మంది విదేశీయులకి అవి అందుబాటులో వుంటున్నాయి. వ్యక్తిపరమైన కొన్ని నేరాలు కనిపిస్తాయికానీ, సంఘపరంగా గవర్నమెంట్ ఆస్తులు కానీ అమాయకుల ఆస్తిపాస్తులని నాశనం చేయటం కనపడదు. తమ హక్కులతో పాటూ, బాధ్యతలని కూడా గుర్తుపెట్టుకునే సమాజం ఇది.

ప్రపంచంలో ఎక్కడ ఏ దేశంలో ఏ కష్టం వచ్చినా అమెరికన్లు ధనరూపేణా వస్తు రూపేణానే కాకుండా ఆ ప్రదేశాలకి వెళ్ళి సహాయ కార్యక్రమాలు అందిస్తున్నారు. అలాగే పరమత సహనం, విదేశీయులని గౌరవించటం ఎక్కువే అని చెప్పొచ్చు. ఏ దేశంలో లేనన్ని మతాలూ విదేశీయత అమెరికాలో చాల ఎక్కువయినా మతపరమైన కలహాలు నేను ఈ పాతికేళ్ళలోనూ చూడలేదు. 911 తరువాత కూడా మహమ్మదీయులని ప్రజలు కొట్టటం, చంపటంలాటివి జరగలేదు. మెథడిస్టులనీ, కాథలిక్స్‌లనీ క్రిష్టియానిటీలో కూడా ఎన్నో వర్గాలు వున్నా, ఎవరి నమ్మకాలు వాళ్ళవే కానీ ఇతరుల మీద విరుచుకుపడటం కనిపించదు.

ఇక గవర్నమెంట్. సెంట్రల్ గవర్నమెంట్ (ఇక్కడ ఫెడరల్ గవర్నమెంట్ అంటారు) రాష్ట్రప్రభుత్వాలమీద అజమాయిషీ చేయటానికి వీల్లేదు. వాళ్ళు ఏ రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకో డబ్బులిస్తే మాత్రం, కొన్ని ఫెడరల్ రూల్స్ పాటించవలసి వస్తుంది. రాష్ట్ర, కౌంటీ (జిల్లా), నగర ప్రభుత్వాలూ ఎవరికి వారే. ఒకళ్ళమీద ఇంకొకరికి అధికారంలేదు. ఇవన్నీ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలే. పోలీసు షరీఫుని జడ్జీలనీకూడా ప్రజలు ఎన్నుకోవాల్సిందే. అలా నాయకులతో పాటు ప్రజలు విషయపరంగా కూడా ఓటు వేస్తారు. సిటీ రోడ్లు వేయటానికి బాండ్ల ద్వారా డబ్బులు వసూలు చేయాలా వద్దా అనీ, కొత్తగా హైస్కూల్ కట్టాలా వద్దా అనీ. ఓటు ప్రకారం ఎలా చెబితే అలా చేస్తారు. ప్రజల దినవారీ జీవితంలో గవర్నమెంట్ అడ్డురాదు. వచ్చిన కొంచెం అయినా ప్రజలు భరించలేరు. వద్దని గొడవ చేస్తుంటారు.

స్వతంత్రంకోసం యూరప్‌నించీ వచ్చి, పూర్తి స్వతంత్ర దేశంగా పుట్టిన దేశం అమెరికా. విదేశీయులు తమకోసం తయారు చేసుకున్న దేశం ఇది. అందుకే ఈనాడూ కొన్ని వేలమంది ఏటేటా ఇక్కడికి వచ్చి నివాసం ఏర్పరుచుకుంటున్నారు. మొదట్లో ఇక్కడ బ్రిటిష్ ఫ్రెంచ్ స్పానిష్ జర్మన్- అందరూ రావటం, స్థానికులతో యుద్ధంచేయటం తర్వాత తమతో తామే పోట్లాడుకోవటం, ఇవన్నీ చూస్తే తుపాకీ గుళ్ళతో స్థాపింపబడిన దేశం ఇది అని అర్థమవుతుంది. ఈనాటికీ ఆ యుద్ధ ప్రాతిపదిక మీదే నడవటం చూస్తే కయ్యానికి ఎందుకు కాళ్ళు దువ్వుతున్నారనిపిస్తుంది. ఈ విషయంలో కూడా ఎవరి వాదనలు వారివి. ప్రపంచంలో ఎవరు బలవంతులయితే వాళ్ళదే మాట. అదే అమెరికాలో, రష్యాలో, జపాన్‌లో ... మళ్ళీ శ్రీశ్రీ గారు చెప్పినట్టు ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం అని.

0 0 0